భారీ వర్షం.. స్తంభించిన జనజీవనం

అల్పపీడన ప్రభావంతో శనివారం భారీ వర్షం కురియడంతో గుడివాడ, పామర్రు, కైకలూరు నియోజకవర్గాల్లోని పలు గ్రామాలు జలమయంగా మారాయి. జన జీవనం స్తంభించి పోయింది. లోతట్టు ప్రాంతాలు, పంట పొలాల్లో వర్షం నీరు నిలిచిపోయింది. పలు కాలనీలు నీట మునగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

- నీట మునిగిన కాలనీలు
- మోకాలు లోతు నీటిలో పంట పొలాలు


గుడ్లవల్లేరు మండలం వడ్లమన్నాడులో చెరువును తలపిస్తున్న వరి పొలం


పామర్రు-యలమర్రురోడ్డులో వర్షం నీటితో వాహనదారుల ఇక్కట్లు

గుడివాడరూరల్: గుడివాడ నియోజకవర్గంలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు నందివాడ, గుడివాడ, గుడ్లవల్లేరు మండలాల్లోని డ్రెయిన్లు, కాల్వలు, చానల్స్ పొంగిపొర్లాయి. బుడమేరు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ నుంచి వస్తున్న నీటితో డ్రెయిన్‌లో నీటమట్టం పెరుగుతోంది. పుట్టగుంట వంతెన వద్ద నీటి ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. మరో రెండు రోజులు వర్షాలు విస్తారంగా కురుస్తాయని అధికారులు చెబుతుండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే రైతులు పొలాల్లో చేరిన నీటిని బయటకు పంపేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. కాగా డ్రెయిన్లు, కాల్వలు, చానల్స్‌లో నీటికి అవరోధంగా ఉన్న తూడు, గుర్రపుడెక్క, కిక్కిసను తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. పట్టణంలో వర్షానికి రహదారులు, కాలనీలు జలమయమయ్యాయి. గుడ్‌మన్‌పేట లోతట్టు ప్రాంతంలోని గృహాలు వర్షపు నీటికి ముంపునకు గురయ్యాయి. వర్షపు నీరు ఇళ్లల్లోకి చేరడంతో నీళ్లను బయటకు పంపడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని, కనీసం చూసేందుకు కూడా రావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

చెరువులను తలపిస్తున్న వరి పొలాలు

గుడ్లవల్లేరు: మండలంలో శనివారం కురిసిన భారీ వర్షానికి వరి పొలాలు సైతం చెరువులను తలపిస్తున్నాయి. అస్తవ్యస్తంగా ఉన్న వడ్లమన్నాడు డ్రెయిన్ కారణంగా 400 ఎకరాల పొలాలు నీట మునిగాయి. పై ప్రాంతం నుంచి వచ్చే మురుగు నీటి కారణంగా పొలాలు మరింత మునకబారిన పడే అవకాశం ఉందని రైతు సంఘ నాయకుడు పెన్నేరు ప్రభాకరరావు తెలిపారు.

మొవ్వలో..

మొవ్వ: అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మొవ్వ మండలంలోని రహదారులు, పొలాలు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కూచిపూడి, పెదపూడి, మొవ్వ, గూడపాడు, కోసూరు, అయ్యంకితో పాటు పలు గ్రామాల్లో రహదారులు, అంతర్గతర రహదారులు నీటమునిగాయి. అలాగే కాజ, వేములమడ, అవురుపూడి గ్రామాల్లో వరి పొలాలు మునిగిపోయి చెరువులను తలపిస్తున్నాయి. పెదపూడిలోని జగనన్న కాలనీలో వర్షం నీటికి తోడు.. కాలువలోని నీరు జతచేరటంతో రహదారులు నీటమునిగి కాలు బయట పెట్టలేని పరిస్థితి ఏర్పడింది.

పామర్రులో..

పామర్రు: పామర్రు మండలంలో శనివారం భారీ వర్షం కురిసంది. పామర్రు-చల్లపల్లి రహదారి వర్షపు నీటితో నిండిపోయింది. దీంతో వాహనదారులు, బాటసారులు ఇబ్బందులకు గురయ్యారు. విజయవాడ-మచిలీపట్నం రహదారిలో వర్షం నీరు రోడ్లపైనే నిల్చింది. డ్రెయినేజీలోని నీరు వర్షం నీరు కలిసి పోయి రహదారిపైకి చేరాయి. స్థానిక గుడివాడ రోడ్డు నుంచి యలమర్రు వెళ్లే రహదారి గోతులమయంగా మారి, వర్షం నీరు రోడ్లపై నిల్వ ఉండటం కారణంగా వాహనదారులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. గ్రంథాలయంలో రోడ్డు పూర్తిగా జలమయంగా మారింది.

తహసీల్దార్ కార్యాలయంలోకి నీరు

పామర్రు తహసీల్దార్ కార్యాలయం నీటితో నిండిపోయింది. కార్యాలయంలోకి వర్షం నీరు చేరటంతో అధికారులు ఆ నీటిలోనే విధులు నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు పామర్రు బస్టాండ్ వర్షం నీటితో నిండిపోయింది.

మండవల్లిలో..

మండవల్లి: మండలంలోని కానుకొల్లు, లింగాల, పెరికెగూడెం, భైరవపట్నం, లోకుమూడి తదితర గ్రామాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. స్థానిక పీహెచ్‌సీలో వర్షం నీరు నిలిచిపోవడంతో పేషెంట్లు సమస్యలు ఎదుర్కొన్నారు. విజయవాడ-భీమవరం ఆర్‌అండ్‌బీ రహదారి నుంచి మండవల్లి మీదుగా మూడుతాళ్లపాడు, ఇంగిలిపాకలంక తదితర కొల్లేటి గ్రామాలకు వెళ్లే కైకలూరు వీధి పూర్తిగా జలమయమైంది.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల జన జీవనం స్తంభించిపోయింది. శుక్రవారం నుంచి ప్రారంభమైన వర్షం ఏ మాత్రం విడువకుండా కురుస్తూ లోతట్టు ప్రాంతాలను పల్లపు పంట భూములను జలమయం చేసింది. ప్రధాన రహదారులు, గ్రామాల్లోని అంతర్గత రోడ్లు పూర్తిగా జలమయమయ్యాయి. ముదినేపల్లి మెయిన్‌రోడ్డుతో పాటు గుడివాడ వెళ్లే జాతీయ రహదారి సైతం భారీ వర్షం నీటితో నిండిపోయి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. స్థానిక అంబేడ్కర్‌నగర్ కాలనీలోని ఇళ్లల్లోకి వర్షం నీరు ప్రవేశించి ప్రజలు అవస్థలు పడ్డారు. మండలంలోని వణుదుర్రు, దేవపూడి, వాడవల్లి గ్రామాల్లోని పంటపొలాలు సైతం భారీ వర్షాలకు నీట మునిగాయి.

పెదపారుపూడిలో..

పెదపారుపూడి: మండలంలోని శనివారం కురిసిన భారీ వర్షానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కుండపోత వర్షం కురవటంతో వెంట్రప్రగడ, వానపాముల, దోసపాడు తదితర గ్రామాల్లో రోడ్ల పై నీరు నిలిచపోయింది. పాలకోడ్, చంద్రయ్య డ్రెయిన్లు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. పంట పొలాల్లోకి వర్షం నీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: మండలంలో శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుండడంతో జన జీవనం స్తంభించిపోయింది. మంటాడ రెడ్డిపాలెం, ఇందిరమ్మ కాలనీలు పల్లంగా ఉండటంతో ఇళ్లలోకి నీరు చేరింది. గురజాడలో చెరువు నిండిపోవడంతో పక్కనున్న పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. మంటాడ, గురజాడ, తాడంకి, కపిలేశ్వరపురం, ముళ్లపూడి, వేల్పూరు, అమీనపురం, మేడూరు గ్రామాల్లో రెండువేల ఎకరాలపైన వరి ముంపునకు గురైనట్లు ఏఓ గణేష్‌రెడ్డి తెలిపారు.


నందివాడ మండలం జనార్దనపురంలో నీట మునిగిన పంట పొలాలను చూపుతున్న రైతులు


గుడివాడ గుడ్‌మన్‌పేటలో ఇంట్లోకి చేరిన వర్షం నీరు


ముదినేపల్లి మెయిన్‌రోడ్‌పై భారీగా చేరిన వర్షం నీరు


వర్షం నీటిలో పామర్రు తహసీల్దార్ కార్యాలయం


మొవ్వ మండలం నీట మునిగిన పెదపూడి జగనన్న కాలనీ


మంటాడ రెడ్డిపాలెంలో చెరువునిండి కాలనీలోకి చేరిన నీరు

కైకలూరులో..

కైకలూరు: అల్పపీడన ప్రభావంతో శుక్రవారం రాత్రి నుంచి శనివారం వరకూ ఆకాశానికి చిల్లు పడిందా అనే విధంగా భారీ వర్షం పడుతోంది. ముదినేపల్లి మండలంలో 238.6 మిల్లీమీటర్లు, కైకలూరు మండలంలో 229.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

చెరువులను తలపించిన రహదారులు

విస్తార వర్షాలతో పామర్రు-దిగమర్రు జాతీయ రహదారిలో అనేక ప్రాంతాలు చెరువులను తలపించాయి. ప్రధానంగా వెలంపేట, రైల్వేస్టేషన్ రోడ్, టౌన్‌హాలు ప్రాంతం, బస్టాండ్ సెంటర్, ఎంపీడీఓ, తహసీల్దారు కార్యాలయాలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదుట రోడ్, కొత్తపేట తదితర లోతట్టు ప్రాంతాలు జలమయయ్యాయి. ముఖ్యంగా సాంఘిక సంక్షేమశాఖ బాలికల అద్దె వసతి గృహం వర్షం నీటితో నిండిపోయింది. విద్యార్థులు అనేక ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి జనసంచారం పూర్తిగా స్తంభించింది. ముదినేపల్లి మండలం పెదగొన్నూరు, మండవల్లి మండలం మొఖసాకల్వపూడి, కైకలూరు మండలం పల్లెవాడ గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. కైకలూరు బస్టాండ్ సెంటర్ , గోపవరం గ్రామాల్లో చెట్లు పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖాధికారులు పునరుద్ధరించారు.


కైకలూరు టౌన్‌హాల్ సమీప రహదారిపై చేరిన వర్షం నీటితో వాహనదారుల అవస్థలు


కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలోకి చేరిన వర్షం నీరు


గుడివాడ ఆర్టీసీ బస్టాండ్‌లో నిలిచిన వర్షం నీరు


చెరువును తలపిస్తున్న గుడివాడ బైపాస్ రోడ్

నీట మునిగిన రహదారులు

గుడివాడ టౌన్: పట్టణంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. పట్టణంలోని డ్రెయిన్లు పూర్తిగా నిండి నీరు పోయే అవకాశం లేక మురుగునీటితో కలిసి వర్షం నీరు రోడ్లపై చేరింది. పట్టణంలో శుక్రవారం 29 మిల్లీ మీటర్లు, శనివారం 169.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పట్టణంలోని ప్రధాన రహదారులతో పాటు బస్టాండ్, బైపాస్ రోడ్, ఎన్టీఆర్ కాలనీ, వాంబే కాలనీ, దనియాలపేట తదితర లోతట్టు ప్రాంతాల్లో సైతం వర్షం నీరు. రోడ్డుపై నిలిచిపోయింది. స్థానిక 11వ వార్డులో దర్శిగుంట అమ్మాజి అనే వృద్ధురాలి ఇంట్లోకి వర్షం నీరు ప్రవేశించింది. ఎటూ వెళ్లలేని వృద్ధురాలు మంచంపైనే కాలంవెళ్లబుచ్చుతున్నారు. అధికారులు స్పందించి వర్షం నీటిని తరలించేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మండవల్లిలో..

మండవల్లి: మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు పలు గ్రామాల్లోని రహదారులు ముంపునకు గురయ్యాయి. ఉనికిలి ఎస్సీ కాలనీ, మూలపేట నుంచి ఉనికిలి వెళ్లే రహదారి నీటి మునగడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు.

సంక్షిప్త వార్తలు

■ కొమరవోలు డ్రెయిన్‌తోనే పొలాల మునక

పామర్రు: మండలంలోని పెదమద్దాలి, అడ్డాడ బాడవా, జమీగొల్వేపల్లి తదితర గ్రామాల పంట పొలాల్లోని మురుగును తొలగించేందుకు కొమరవోలు డ్రెయిన్‌ను ఏర్పాటు చేశారు. ఈ డ్రెయిన్‌లో పూడిక తీయకపోవడంతో పొలాల్లోని నీరు దిగువకు ప్రవహించే మార్గం లేక పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయని రైతులు తెలిపారు. ఈ విషయమై జమీగొల్వేపల్లి రైతులు గోపాలకృష్ణ, పొట్లూరి పూర్ణ చంద్రరరావు గతంలో కలెక్టర్‌కు 'స్పందన'లో అర్జీని సమర్పించినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

■ 91 శాతం పింఛన్ల పంపిణీ

కైకలూరు: మండలంలో 91 శాతం పింఛన్లు పంపిణీ చేశామని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు శనివారం తెలిపారు. ఇకపై ఒకటో తేదీ ఆదివారం వస్తే ముందు రోజే పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. తహసీల్దారు ఎం.ఉదయభాస్కరరావు, సర్పంచ్ మేరీ నవరత్నకుమారి, నాయకులు త్రినాథరాజు, అప్పారావు, వెంకట రాంప్రసాద్, బాబి పాల్గొన్నారు.

■ ఆక్రమణలను తొలగించాలి

కైకలూరు: ముంపునకు ప్రధాన కారణమైన పుల్లవ, రాళ్లకోడు, వార్లకోడు ఆక్రమణల తొలగింపునకు జిల్లా కలెక్టర్ తెలంగాణ హైడ్రా పద్ధతులను కైకలూరులో అమలు చేయాలని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ వేంపాటి విష్ణురావు కోరారు. కొందరు స్వార్థపరులు విచ్చలవిడిగా పంటకాల్వలను, డ్రెయినేజీ వ్యవస్థలను ఆక్రమించుకుని వెంచర్ల ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి వారిపై కలెక్టర్ విచారణ చేపట్టి చర్యలకు ఆదేశించాలని కోరారు.

■ మల్లికార్జున్ సేవలు మరువలేనివి

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు తహసీల్దార్‌గా పి.మల్లికార్జున్ అందించిన సేవలు మరువలేనివని డీటీ బి.కనకదుర్గ అన్నారు. ఉద్యోవిరమణ చేసిన మల్లికార్జున్ దంపతులను శనివారం సన్మానించారు. ఆర్ఐ షకీలాబేగం, సర్వేయరు రామకృష్ణ, వీఆర్వోలు ప్రకాష్, భాస్కరరావు, మల్లికార్జునరావు, రామ్మూర్తి, రమేష్, లక్ష్మయ్య, రవి పాల్గొన్నారు.

■ కష్టపడి పని చేస్తే గుర్తింపు

భూషణగుళ్ల(పెదపారుపూడి): కష్టపడి పని చేస్తే ప్రజల్లో గుర్తింపు వస్తుందని తహసీల్దార్ రంగారావు అన్నారు. భూషణగుళ్ల వీఆర్వో భగవంతరావు శనివారం ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని గ్రామస్తులు నిర్వహించారు. వీఆర్వో దంపతులను మాజీ సర్పంచ్ కొల్లి రాధాకృష్ణ, రమణ, శ్రీకాంత్ సన్మానించారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కైకలూరు: ప్రభుత్వ జూనియర్ కాలేజీలో కామర్స్ అతిథి అధ్యాపక పోస్టునకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎస్.శాంతిజ్యోతి శనివారం విలేకరులకు తెలిపారు. దరఖాస్తుదారులు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి 50 శాతం ఎంకామ్ ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల రెండో తేదీ సాయంత్రం మూడు గంటలలోపు కాలేజీలో దరఖాస్తులు అందించాలని తెలిపారు. మరుసటి రోజు కాలేజీలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

పసుమర్రు(పామర్రు): పామర్రు మండలం పసుమర్రు గ్రామంలో ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ ఆఫ్ తాడిగడప సాయినగర్ వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు కాజాస్ హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకులు లయన్ కేవీఎస్ చౌదరి శనివారం తెలిపారు. బీపీ, షుగర్, గుండె పరీక్షలు, ఈసీజీ తదితర వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

పామర్రు: ప్రజా సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని, ఇందులో భాగంగా ముందుగానే పెన్షన్ పంపిణీ చేస్తున్నట్లు పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. పామర్రు టౌన్‌లోని పలు చోట్ల లబ్ధిదారులకు పెన్షన్లను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, నాయకులు పాల్గొన్నారు.


పామర్రులో లబ్ధిదారులకు పెన్షన్ అందజేస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

కొండిపర్రులో..

పామర్రు మండలం కొండిపర్రు గ్రామంలో లబ్ధిదారులను శనివారం పెన్షన్ నగదు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నూకవరపు వీరాంజనేయులు, పసుపులేటి విజయ్‌కుమార్, సత్యనారాయణ, చిరంజీవి, సువర్ణ రాజు ముదునూరి, వీఆర్వో బేబి సరోజని తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ నిర్మాణం వెంటనే చేపట్టాలి

గుడివాడ టౌన్: బస్టాండ్ నిర్మాణం పనులు వెంటనే చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన బస్టాండ్ ఆవరణలో నిలిచిన వర్షపు నీటిలో నిలబడి నిరసన తెలిపారు. 1996లో అధికారం చేపట్టిన చంద్రబాబు నాయుడు అప్పటి మంత్రి నందమూరి హరికృష్ణ బస్టాండ్ సందర్శించి వెంటనే అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చి గాలికి వదిలేశారన్నారు. అప్పటి నుంచి ప్రతి వర్షాకాలం బస్టాండ్ నీట మునుగుతూనే ఉంది. గత ప్రభుత్వం బస్టాండ్ అభివృద్ధికి రూ. 22 కోట్లు కేటాయించి ఫేజ్-1 పనులు పూర్తిచేసిందని తెలిపారు. నిధులు ఉన్నప్పటికీ నూతన బస్టాండ్ నిర్మాణం చేపట్టకపోవడం విచారకరమన్నారు. పట్టణాన్ని సుందరీకరణంగా మారుస్తామని, అభివృద్ధి చేస్తామని చెబుతున్న నాయకులు తక్షణమే నిర్మాణం పనులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.


వర్షం నీటిలో నిరసన తెలుపుతున్న ఆర్‌సీపీ రెడ్డి

కూలేందుకు సిద్ధంగా వంతెన

పమిడిముక్కల: హనుమంతపురం-కనుమూరు ఆర్‌అండ్‌బీ రహదారిపై వేల్పూరు వద్ద మురుగుకాల్వపై ఉన్న వంతెన ప్రమాదకరంగా ఉంది. కాల్వలో నీటి ప్రవాహం పెరగడంతో వంతెన వద్ద ఒకవైపు రోడ్డంతా కోతకు గురై వంతెన కూలిపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. హనుమంతపురం, ముళ్లపూడి, వేల్పూరు, ఐనంపూడి గ్రామాల ప్రజలు నిత్యం ఈ వంతెనపై నుంచే కనుమూరుకు రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పటికైనా కొత్త వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



క్లుప్తంగా

హుండీల్లో కానుకల లెక్కింపు



పామర్రు: మండలంలోని పలు ఆలయాల్లో శనివారం హుండీల్లో కానుకలను లెక్కించినట్లు ఆలయ మేనేజర్ కందుల వెంకటరెడ్డి తెలిపారు. మండలంలోని కనుమూరు, పామర్రు, నిమ్మకూరు ఆలయాల్లోని హుండీల కానుకలను లెక్కించినట్లు పేర్కొన్నారు. దేవదాయశాఖ తనిఖీ అధికారి, గుడివాడ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ సమక్షంలో కానులకను లెక్కించినట్లు పేర్కొన్నారు. కనుమూరులోని విష్ణాలయం, శివాలయాల్లోని కానుకల లెక్కించగా రూ.21,545 ఆదాయం వచ్చిందని తెలిపారు. పామర్రులోని విష్ణాలయంలో రూ.29,228, నిమ్మకూరు ఆలయానికి రూ.12,791 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది ప్రభాకర్‌రెడ్డి, అర్చకులు ఆర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా గంగానమ్మ గ్రామోత్సవం



జమీదగ్గుమిల్లి(పామర్రు): పామర్రు మండలం జమీదగ్గుమిల్లిలో గంగానమ్మ తల్లి ఘటం, పోతురాజు గడకు శనివారం ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. తొలుత ఆలయంలోని గంగానమ్మ అమ్మవారికి జలాభిషేకాలను చేసి అమ్మవారిని పసుపు కుంకుమలతో నూతన వస్త్రాలతో అలంకరించారు. ఆదివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి ఆలయంలో అమ్మవారికి శాస్త్ర రీత్యా ముగ్గు వేసి, కుంభ నైవేద్యం, మొక్కులు, వేడి నైవేద్యాలు సమర్పించాలని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

శనిత్రయోదశి పూజలు



కూచిపూడి(మొవ్వ): శనిత్రయోదశి పూజలు మొవ్వ మండలంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. దేవాలయాల్లోని నవగ్రహాలకు తైలాభిషేకాలు, నల్లనువ్వులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూచిపూడిలోని శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరునికి అర్చకులు అభిషేకాలు నిర్వహించారు.

చవితి వేడుకలకు నిబంధనలు పాటించాలి

ముదినేపల్లి రూరల్: వినాయకచవితి వేడుకల నిర్వాహకులు పోలీసుల సూచనలు పాటించాలని ఎస్సై డి.వెంకట్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేడుకలకు సంబంధించి నిర్వహించే కార్యక్రమాల వివరాలు ఆన్‌లైన్లో దరఖాస్తులో వివరించి సింగిల్ విండో ద్వారా అనుమతులు పొందాలన్నారు.

పింఛన్ల పంపిణీ

ముదినేపల్లి రూరల్: మండలంలో పింఛన్ల పంపిణీ శనివారం ప్రశాంతం సాగింది. మండల వ్యాప్తంగా 9,020 మందికి పింఛన్లు అందజేయాల్సి ఉండగా శనివారం పింఛన్లు తీసుకోని వారికి సోమవారం అందజేస్తామని అధికారులు తెలిపారు.

విద్యుత్ వినియోగంపై అప్రమత్తంగా ఉండాలి

ముదినేపల్లి రూరల్: భారీ వర్షాలు కురుస్తున్నందున విద్యుత్ వినియోగంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ ఏఈ పేర్ని రవికుమార్ అన్నారు. ముదినేపల్లిలో శనివారం ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగానికి సంబంధించి ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. తడిసిన విద్యుత్ స్తంభాలను, తడిచేతులతో స్టార్టర్లు, మోటార్లు ముట్టుకోవద్దని సూచించారు.

నత్తనడకన రహదారి విస్తరణ పనులు

మండవల్లి: జాతీయ రహదారి విస్తరణ పనులు నత్తనడకగా నడుస్తున్నాయని ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, మండల శాఖ అధ్యక్షుడు టి.అప్పారావు పేర్కొన్నారు. నాయకులు శనివారం విలేకరులతో మాట్లాడుతూ డ్రెయినేజీ నిర్మాణం పనులు పూర్తి కాకపోవడంతో వర్షం పడితే ముంపు సమస్య వల్ల గ్రామస్తులు, వాహనదారులు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. స్థానిక శ్రీ కృష్ణాలయం నుంచి కైకలూరు సందు వరకు రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో రోడ్డు పూర్తిగా శిథిలమై గుంతలమయంగా మారిందన్నారు. అధికారులు ముంపు సమస్యపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

వైఎస్సార్ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలి



కైకలూరు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని సోమవారం నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించాలని ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) శనివారం పేర్కొన్నారు. కైకలూరు సంత మార్కెట్ వద్ద వైఎస్ విగ్రహానికి ఉదయం 8.30 గంటలకు నివాళులర్పిస్తామని తెలిపారు. నియోజకవర్గంలోని ఎంపీపీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులంతా వర్ధంతి కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

వర్షం నీరు తొలగింపునకు చర్యలు


పనులు పరిశీలిస్తున్న కమిషనర్

గుడివాడ టౌన్: పట్టణంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా రోడ్లపై నిలిచిన నీటిని తరలించేందుకు చర్యలు చేపట్టామని మున్సిపల్ కమిషనర్ జి.బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. శనివారం స్థానిక అరవపేట సమీపంలోని చింతలకోడు డ్రెయిన్‌లో నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న చెట్లు తొలగింపు కార్యక్రమం చేపట్టారు. కమిషనర్ మాట్లాడుతూ పనులు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. స్వయంగా పనులు పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు.

లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఉయ్యూరు ఆర్డీఓ రాజు

పామర్రు(తోట్లవల్లూరు): కృష్ణానది వరద, కురుస్తున్న భారీ వర్షంతో లంక గ్రామాల ప్రజలు, రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాలని ఉయ్యూరు ఆర్డీఓ డి.రాజు పేర్కొన్నారు. తోట్లవల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో శనివారం పలుశాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కృష్ణానదిలో నీటి శాతం పెరిగే అవకాశాలున్నాయన్నారు. పై నుంచి ఎక్కువగా ఉన్న నీటిని దిగువనకు వదిలే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. దీని వలన నీటి ప్రవాహ ఉద్ధృతి పెరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తహసీల్దార్ కుసుమకుమారి, సీఐ చిట్టిబాబు, ఎస్ఐ అర్జునరాజు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సాయిప్రసన్న, ఎంఈఓ సురేష్ పాల్గొన్నారు.